క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

మోత్కూరు : మున్సిపల్ పాలక వర్గ సమావేశాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా టీయూఎఫ్ఐడీసీ నుంచి మంజూరైన రూ.5.6కోట్లతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులకు ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

5న పోచంపల్లి అర్బన్ బ్యాంక్ సమావేశం

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 5న పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సభ్యులంతా సకాలంలో హాజరు కావాలని కోరారు.

కమ్యూనిటీ ప్లాంటేషన్ పరిశీలన

మోత్కూరు: మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను డీఆర్‌పీ స్వామి, ఏపీఓ పల్లవి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 2 ఎకరాల్లో సాగు చేసిన 1,310 రకాల పూల మొక్కలను పరిశీలించారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు కంచర్ల సోమిరెడ్డి, వాచర్ కోల నర్సయ్య ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

భువనగిరి : ఈ నెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో విద్యుత్ సౌధ మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం విద్యుత్ బీసీ, ఓసీ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం డీఈ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో బొబ్బిలి మురళీ, శ్రీనివాస్, నరేష్, బాలనర్సింహ, లింగం, నర్సింహ, వెంకటేష్, వెంకటేశ్వర్లు,సోమమ్మ, బాలమణి పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలి

ఆత్మకూరు(ఎం): నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన నాయీ బ్రహ్మణ సంఘం సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల భిక్షం, మండల ప్రధాన కార్యదర్శి బండి నరేష్, కోశాధికారి కృష్ణ, పట్టణ అధ్యక్షుడు బలరాం పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం అదే గ్రామానికి చెందిన నక్కల రాజిరెడ్డి రూ.20వేల విలువైన ప్రింటర్ కమ్ స్కానర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దారెడ్డి మల్లారెడ్డి, బాలచంద్రంగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేష్, ఉపాధ్యాయులు పద్మ, కృష్ణ, లక్ష్మీ, సంగీత, అఖిల పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పురుగుల నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ సమీర్, జానిపాషా, ఖలీల్, శ్యామల ప్రకాష్, సోమలింగాచారి, ఖలీల్, మందుల సురేష్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ

చౌటుప్పల్ రూరల్: ముందు వెళ్తున్న కారును లారీ ఢీకొన్న సంఘటన మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతిన్నది. కారులో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మయ్య తెలిపారు.

కట్టమైసమ్మకు పూజలు

చౌటుప్పల్ రూరల్: మండలంలోని పెద్ద కొండూర్ గ్రామంలోని చెరువు మంగళవారం అలుగు పోస్తోంది. దీంతో గ్రామస్తులు, రైతులు చెరువు కట్ట మీద ఉన్న కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాయితీ రమేష్,బద్దం పాండురెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జయమ్మ పాల్గొన్నారు.

వసతిగృహం మంజూరుపై హర్షం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా బీసీ బాలుర కళాశాల వసతి గృహం మంజూరు చేయడం పట్ల ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రభా జస్టిస్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ఆలేరురూరల్: పాము కాటుకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన బొడ్డు శంకరయ్య(48) సోమవారం సాయంత్రం తన వ్యవసాయబావి వద్ద పాము కాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రజనీకర్ మంగళవారం తెలిపారు.

అడుగుకో గుంత.. ప్రయాణించేదెట్లా?

- గుంతలమయంగా రహదారులు
- వర్షపు నీటితో నిండి కుంటలను తలపిస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా మారిన కాటేపల్లి రోడ్డు



మోటకొండూర్ - దిలావర్‌పూర్ రోడ్డు

మోటకొండూర్: అసలే అధ్వాన రహదారులు.. ఆపై వర్షాలు కురవడంతో మండలంలోని పలు రహదారులు రూపురేఖలు కోల్పోయాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, బురదమయమైన దారులే కనిపిస్తున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో రోడ్లపై వర్షపు నీటితో నిండిన గుంతలు కుంటలను తలపిస్తున్నాయి. ఇక గ్రామాలు, తండాల్లో అయితే రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కిలోమీటర్ల మేర దారులు బురదతో నిండిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మోత్కూర్ ప్రధాన రహదారిలోని కాటేపల్లి - ముత్తిరెడ్డిగూడెం మధ్య గల బ్రిడ్జి పనులు పూర్తి కాలేదు. మట్టి పనులు చేసి వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. కాటేపల్లి బ్రిడ్జికి ఇరువైపులా కోతకు గురైంది. బురద.. గుంతల రోడ్డు పై ప్రయాణించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి దిలావర్‌పూర్ మీదుగా మంతపురి రోడ్డు వరకు బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. మాటూర్-వర్దూర్ బీటీ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ప్రమాదకరంగా మారిన రహదారులను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



మోత్కూర్-రాయిగిరి ప్రధాన రహదారిలో నిత్యం వేల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి చాలా సంవత్సరాలు గడుస్తుంది. కానీ కాటేపల్లి-ముత్తిరెడ్డిగూడెం మధ్యలో గల బ్రిడ్జి పనులు పూర్తి చేయలేదు. మట్టి రోడ్డు పోసి వదిలేశారు. దీంతో వర్షాలు పడితే రోడ్డు గుంతలమయంగా మారి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– పబ్బతి జయంత్‌రెడ్డి, చాడ

ఇబ్బందులు పడుతున్నాం



మోటకొండూర్ మండల కేంద్రం నుంచి దిలావర్‌పూర్ మీదుగా ఆలేరు వరకు ఉన్న బీటీ పూర్తిగా ధ్వంసమైంది. వర్షాలు వస్తే గుంతలునీటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

–సీస బాలరాజు గౌడ్, మాజీ సర్పంచ్, దిలావర్‌పూర్

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

చౌటుప్పల్ : రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ విమర్శించారు. పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకకాలంలో రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి సర్వేల పేరిట కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్ బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి గంగదేవి సైదులు, బూర్గు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశం, రాగీరు కిష్టయ్య, తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ, కొండె శ్రీశైలం, సుదర్శన్, యాదయ్య, శ్రీను, వెంకటేశం, అశోక్, రమణారెడ్డి, సంజీవ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పూర్తిచేయాలి

యాదగిరిగుట్ట రూరల్: తప్పులు లేని ఓటరు జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు లిస్టును యథావిధిగా పరిగణలోకి తీసుకుని గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటర్ల జాబితా రూపకల్పన చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, ఓటరు లిస్టును తయారు చేయాలని సూచించారు. ఓటరు లిస్టు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సలీమ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలి

ఆలేరురూరల్ : అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీలను తుంగలో తొక్కిందన్నారు. ప్రతి పేదవాడికి ఇందరిమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డు ఆంజనేయులు అంజయ్య, ప్రవీణ్, రవి, స్వామి, పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఆత్మకూరు(ఎం): మాట్లాడుతున్న రచ్చ శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనువాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ మండల స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు బీజేపీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ అధ్యక్షతన వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఊటుకూరి అశోక్ గౌడ్, రాష్ట్ర నాయకులు బొట్టు అబ్బయ్య, సూదగాని శ్రీహరి, మేడి సాగర్, లోడి వెంకటయ్య, కొత్త భాస్కర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, బూడిద నరసింహ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి

మోటకొండూర్: బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేముల నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు తండ కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిర్ర రవీందర్, గాజుల బాలరాజుగౌడ్, అనంతుల పాండురంగారెడ్డి, ఆలేటి నాగరాజు, బాల్ద నర్సింహులు, భూమండ్ల సతీష్, మల్గ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



చౌటుప్పల్ : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మన్మథకుమార్



ఆలేరురూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

చౌటుప్పల్ : గణేశ్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సీఐ మన్మథకుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, మండల పరిషత్, మున్సిపల్, ఫైర్ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతమైన వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. మండపాల నిర్వాహకులు ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి వేడుకలను శాంతియుతంగా ముగిసేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఆలె నాగరాజు, కొయ్యడ సైదులు, కొరగోని లింగస్వామి, ఎండీ.బాబాషరీఫ్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఆలేరురూరల్ : గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏసీపీ రమేష్ అన్నారు. గణేశ ఉత్సవాలకు సంబంధించి మంగళవారం లక్ష్మీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గణేష్ పండగను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. మండపాల కోసం విద్యుత్ అనుమతులు తప్పని సరి తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. మండపాల ముందు సీసీ కెమరాలు ఏర్పాటుతో పాటు ఫైర్ సేఫ్టీ కూడా తప్పక పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ కొండల్ రావు, ఎస్సై రజినీకర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమీషనర్ కె.లక్ష్మి, ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నది ప్రక్షాళన కోసం ఉద్యమించాలి



భువనగిరి రూరల్ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భువనగిరి రూరల్ : మూసీ నది ప్రక్షాళన కోసం ఉద్యమించాలని మూసీ ప్రక్షాళన, గోదావరి, కృష్ణా జలాల సాధన వేదిక జిల్లా కో కన్వీనర్ కొండమడుగు నర్సింహ అన్నారు. ఈ నెల 6న వలిగొండ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సు కు సంబంధించి కరపత్రాన్ని మంగళవారం మండలంలోని అనాజీపురం గ్రామంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా నాయకులు దయ్యాల నర్సింహ, మాజీ సర్పంచ్ బొల్లెపల్లి కుమార్, పాల సంఘం మాజీ చైర్మన్ ఏదునూరి మల్లేశం, నీటి సంఘం మాజీ చైర్మన్ గునుగుంట్ల శ్రీనివాస్, అబ్దుల్లాపురం వెంకటేశ్, ఎండీ.జహంగీర్, కడారి కృష్ణా, నానపురం అశోక్, తెల్జీరి రాములు, లక్ష్మయ్య, మానపాటి ఎల్లయ్య పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీటిని అందించాలి

వలిగొండ : మూసీ ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని సీపీఎం నాయకుడు, జల సాధన కమిటీ జిల్లా కన్వీనర్ మాటూరి బాలరాజు అన్నారు. ఈ నెల 6 న నిర్వహించనున్న మూసీ ప్రక్షాళన, బునాదిగాని కాల్వ, భీమలింగం కాల్వల ద్వారా కృష్ణా, గోదావరి జలాల సాధన కోసం నిర్వహించనున్న సదస్సు పోస్టర్ మండలంలోని పులిగిల్లలో మంగళవారం ఆవిష్కరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల వ్యర్థ కాలుష్యాలతో మూసీ విష కూపంగా మారిందన్నారు. విషపు నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే మూసీ ప్రక్షాళన చేపట్టి గోదావరి జలాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పంగి స్వామీ, వాకిటి వెంకట్ రెడ్డి, దొడ్డి భిక్షపతి, వారికుప్పల యాదయ్య, వడ్డేమాని వెంకటయ్య, మారబోయిన నర్సింహ, బొడ్డు రాములు, వేముల దావీదు, వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటాలని మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లబావి,ఆరెగూడెం, కాట్రేవ్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకోవడానికే బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు కుట్ర రాజకీయాలు చేస్తున్నాయన్నారు.గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ పబ్బు రాజుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ మండల అధ్యక్షుడు బక్క శ్రీనాథ్, పిసాటి శ్రీధర్‌రెడ్డి, జాల మల్లేష్, శివాజీ, వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్, మాసిరెడ్డి, నరేష్, ప్రభాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారినంటూ వ్యాపారులకు ఫోన్లు

– పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి

చౌటుప్పల్: జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారినంటూ గుర్తుతెలియని వ్యక్తి చౌటుప్పల్ మండల కేంద్రంలోని పలువురు కిరాణా వ్యాపారులకు ఫోన్లు చేశాడు. ఈ విషయాన్ని సదరు వ్యాపారులు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా ఉన్న పట్టణ కేంద్రానికి చెందిన డాక్టర్ సుమన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యక్తి తమకు ఫోన్ చేసి తన పేరు శ్రీకాంత్‌రెడ్డి అని, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా పరిచయం చేసుకున్నట్లు వ్యాపారులు తెలిపారు. 'మీ వ్యాపారాల సంగతి నాకు తెలుసు, మీ జోలికి రావొద్దంటే కొంత నగదు ఇవ్వాలని' డిమాండ్ చేశాడని, తమకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సుమన్‌కళ్యాణ్ అని తె లియడంతో వెంటనే విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యూ-డైస్‌పై శిక్షణ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికొన్నత, జిల్లా పరిషత్ ఉన్నత, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు మంగళవారం యూ-డైస్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూరెళ్ల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు దామోదర్ ప్రధానోపాధ్యాయులు రత్నమాల, శ్రీధర్‌రావు, పద్మ, రమేష్, వెంకటేశ్వర్లు, సీఆర్‌పీలు సత్తయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మోత్కూరు : మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పైళ్ల సోమిరెడ్డి, గుర్రం లక్ష్మీనర్సింహ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ఆకుల వెంకటేశ్వర్లు, సురేష్, మాజీ ఎంపీటీసీ లక్ష్మ ణాచారి, జ్ఞానేశ్వర్, కనకయ్య పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపల్లి కాలువ నీటితో చెరువు నింపాలి



ధర్మారెడ్డిపల్లి కాలువ నీటిలో నిల్చుని నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

రామన్నపేట : ధర్మారెడ్డిపల్లి కాలువ నీటితో రామన్నపేటలోని పెద్దచెరువును నింపాలని మత్స్య కార్మికసంఘం అధ్యక్షుడు కందుల హన్మంత్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రామన్నపేట శివారులో ధర్మారెడ్డిపల్లి కాలువనీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మారెడ్డిపల్లి కాలువనుంచి ఫీడర్ చానల్‌ను ఏర్పాటు చేసి చెరువులను నింపి తమకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దబోయిన మీనమ్మ, బచ్చ రాములు, లింగస్వామి, జింకల చిన్నరాములు, భాగ్యమ్మ, అనసూయ, నర్సమ్మ, ఇందిర, రాములమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దు



సంస్థాన్‌నారాయణపురం : దరఖాస్తులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయధికారి గోపాల్

చౌటుప్పల్ రూరల్: రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మండలంలోని ఎస్.లింగోటం గ్రామంలో రైతు వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 1623 దరఖాస్తులకు గాను 424దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసినట్లు ఏఓ ముత్యాల నాగరాజు తెలిపారు. ఈ నెల 20వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ఆయన వెంట పలువురు వ్యవసాయ అధికారులు ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

సంస్థాన్ నారాయణపురం: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు కుటుంబాల నిర్ధారణ కోసం నిర్వహించిన కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రైతుల నుండి వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. రుణమాఫీ కాని రైతులందరూ వ్యవసాయాధికారికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హతలందరికీ రుణమాఫీ కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఎవరు అపోహలకు గురి కావొద్దన్నారు. అనంతరం మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిలవలకు, స్టాక్ రికార్డులకు, ఈ-పాస్ మిషన్‌లోని వివరాలకు సరిపోల్చి చూశారు. ఆయన వెంటఏఓ పావని, ఏఈఓలు నవీన్, సైదులు, శివకుమార్, స్వప్నిక, సోమప్ప, అనురాధ ఉన్నారు.

అనుమతులు లేకుండా జూనియర్ కళాశాల నిర్వహణ

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని జగదేవ్‌పూర్ రోడ్డు మార్గంలో ప్రైవేట్ జూనియర్ కళాశాల అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు అధికారుల తనిఖీతో వెలుగులోకి వచ్చింది. పట్టణంలో జైహింద్ పేరుతో ఎంపీసీ గ్రూపు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విభాగాలతో కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరానికి 45 అడ్మిషన్లు, ద్వితీయ సంవత్సరంలో 15 అడ్మిషన్లు ఉన్నాయి. మంగళవారం డీఐఈఓ రమణి కళాశాలను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా కళాశాల నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

ఆలేరురూరల్ : పట్టణ కేంద్రంలోని స్థానిక రామకృష్ణ విద్యాలయంలో మంగళవారం జననీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ కుంతావత్ కమలాకర్, ఎస్ఆర్‌కేవీ కరస్పాంటెండెంట్ బండిరాజుల శంకర్, జూకంటి సంపత్, మైదం భాస్కర్, తరిగొప్పుల రమేష్, దూడల వెంకటేష్, సిద్దేశ్వర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మోకు దెబ్బ అధ్యక్షుడిగా రమేష్

ఆలేరురూరల్: సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొలనుపాకకు చెందిన దూడల రమేష్‌గౌడ్ మంగళవారం నియామకమయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జక్క వీరస్వామిగౌడ్ నియామకపత్రం అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భువనగిరి రూరల్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు అన్నారు. మండలంలోని కూనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపాక్స్ వైరస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు ఇంద్రాని, సింధు, మహేశ్వరి, సాయి నిఖిత, గౌతమి, సైన్స్ ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

పట్టు చీర సమర్పణ



వేడుకలో పాల్గొన్న పద్మశాలీలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ నల్ల పోషమ్మ దేవి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రానికి చెందిన పద్మశాలీలు మంగళవారం ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసిన మగ్గంపై పట్టు చీర నేసి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం, పద్మశాలి యువజన సంఘం, చేనేత కార్మిక సంఘం, చేనేత ఉత్పత్తిదారుల సంఘం, సిల్క్ యారన్ సంఘం, శ్రీ మార్కండేశ్వరస్వామి దేవాలయం, మద్దెలమ్మదేవి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ నాయకులు

మోత్కూరు : సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారు మాట్లాడుతూ జీఓ నంబర్ 11, 12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. ఏయిడెడ్, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా జీతాలు అందించాలన్నారు. సర్వశిక్ష అభియాన్, కేజీబీవీలలో పని చేస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పసునూరి సుధాకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాజిడి రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని రామకృష్ణ, ఇండ్ల రాంప్రసాద్, మండడి రాంరెడ్డి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న సీఐ మన్మథకుమార్

చౌటుప్పల్ రూరల్: తనకు దొరికిన బ్యాగును పోలీసులకు అందజేసి ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వలిగొండ మండలం పులిగిల్లకు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి నర్సిరెడ్డి హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం భార్యాపిల్లలతో కలిసి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద ఆగాడు. బైక్‌పై ఉన్న బ్యాగును రోడ్డు పక్కన ఉంచాడు. అనంతరం బైక్‌పై బయల్దేరుతూ బ్యాగును అక్కడే మర్చిపోయాడు. అదే దారిలో ఆటోలో వెళ్తున్న సంగెం గ్రామానికి చెందిన బొడిగె శ్రీను ఆ బ్యాగును గమనించి ఆటో నిలిపి బ్యాగును తీసుకుని చూశాడు. అందులో 3 తులాల బంగారు ఆభరణాలు, డబ్బులు ఉండడంతో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సీఐ మన్మథకుమార్‌కు బ్యాగు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న శ్రీనును సన్మానించారు.

ఉద్యమకారులను గుర్తించాలి

వలిగొండ : రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాల ఉమ్మడి తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి కిష్టఫర్ అన్నారు. మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మారగొని శ్రీనివాస్ గౌడ్, శీలం స్వామి, మల్లమ్మ, పుష్ప ,మల్లం వెంకటేశం, మంటి రమేష్, మంటి శంకర్, గంగాదారి సత్తయ్య, కదిరేని స్వామి, కన్నెగంటి శ్రీనివాసచారి, పబ్బు లక్ష్మయ్య, మంటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీకృష్ణనగర్ కాలనీకి చెందిన పి. శ్రీకాంత్ ఆగస్టు 25న చౌటుప్పల్ బస్టాండ్‌లోని కార్గో కార్యాలయం ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. కొంతసేపటి తర్వాత వచ్చి చూసేసరికి అతడి ద్విచక్ర వాహనం కనిపించలేదు. అప్పటి నుంచి పట్టణంలోని పలు ప్రాంతాల్లో వెతికాడు. ఎక్కడ వెతికినా ద్విచక్ర వాహనం దొరక్కపోవడంతో మంగళవారం చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.